సాక్షి
విశాఖపట్నం
గురువారం । 28 । మార్చి । 2024



'వాహన మిత్రో'త్సాహం!

ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఎంతగానో ఉపయోగపడింది. 8లో



చట్టాలపై అవగాహన

చిన్న చిన్న తగదాల కోసం కోర్టులు, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించొద్దని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. 8లో



పెండింగ్ దరఖాస్తులపై దృష్టి

ఫారం-7, 8 దరఖాస్తులపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

చెక్ పోస్టుల వద్ద తనిఖీల పరిశీలన



చెక్ పోస్టుల్లో పోలీసులు జరుపుతున్న తనిఖీలను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చెక్ పోస్టుల వద్ద పోలీసులు జరుపుతున్న తనిఖీలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్వయంగా పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలవుతున్న క్రమంలో రాష్ట్ర, జిల్లా సరిహద్దులతో పాటు పలు ముఖ్య ప్రాంతాల్లో ఎంసీసీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, అడవివరం ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీలను మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 5 చెక్ పోస్టులలో గురువారం నుంచి స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు తనిఖీలు నిర్వహిస్తాయని చెప్పారు. ఏసీపీలతో మాట్లాడి పలు సూచనలు చేసిన ఆయన సీజర్స్ మేనేజ్‌మెంట్ (ఈఎస్ఎంఎస్) కింద చేపట్టిన అంశాలపై సమాచారాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'అరణ్య' కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈస్ట్‌కోస్ట్ జనరల్ మేనేజర్ మనోజ్‌కుమార్ శర్మ

తాటిచెట్లపాలెం : విశాఖపట్నంలో వాల్తేర్ డివిజన్ నూతనంగా ఏర్పాటు చేసిన 'అరణ్య' ఔట్ డోర్ క్యాంపింగ్ కేంద్రాన్ని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ కుమార్ శర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్ బృందాన్ని ఆయన అభినందించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, అనురాగ్ మాంటిస్సోరి స్కూల్, వాకర్స్ కోసం ఈ కేంద్రం నిర్మించామని రైల్వే అధికారులు తెలిపారు. ఔట్ డోర్ యాక్టివిటీ కేంద్రం పిల్లల్లో ఆరోగ్యం మెరుగుదలకు, ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈకార్వో భువనేశ్వర్ ప్రెసిడెంట్ దివ్య శర్మ, వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఈకార్వో వాల్తేర్ ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), మనోజ్ కుమార్‌సాహు (ఆపరేషన్స్), ఈకార్వో వైస్ ప్రెసిడెంట్లు కవితా గుప్తా, మధుస్మిత సాహు పాల్గొన్నారు.

3,650 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం పెందుర్తి, సుందర్‌నగర్, అక్కిరెడ్డిపాలెం, కప్పరాడ, పెదగంట్యాడ, ఇందిరానగర్, ములగాడ, దొండపర్తి, కొబ్బరితోట, పాత వెంకోజీపాలెం, దండుబజార్, సాగర్‌నగర్, స్వతంత్రనగర్‌లో వైద్య శిబిరాలు జరిగాయి. ఈ శిబిరాలను డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. మొత్తం 3,650 మందికి వైద్య సేవలందించామని, 13 మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశామన్నారు. బక్కన్నపాలెం(రిక్షా కాలనీ), తోటగరువు, విద్యానగర్, పాత వెంకోజీపాలెం, రంగిరీజువీధి, జబ్బరితోట, శివనగర్, ఇందిరానగర్, కణితి, గాజువాక, నరసింహనగర్‌లో గురువారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పుట్టినింటి రుణం తీర్చుకుంటా

సాక్షి ఇంటర్వ్యూ



- వైజాగ్ రాజధాని అయితే రాష్ట్రమంతా అభివృద్ధి
- విశాఖ పార్లమెంట్ చరిత్రలో తొలిసారి బీసీ మహిళకు అవకాశం కల్పించారు
- ఈ ప్రాంత ఆడపడుచుగా స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటా..
- సీఎం జగన్‌తో మహిళల్లో ఆర్థిక స్వావలంబన సాధ్యమైంది
- విశాఖ విజన్ కోసం నాడు పార్లమెంట్ సాక్షిగా కృషి చేశా..
- వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

సాక్షి, విశాఖపట్నం: 'విశాఖే నా పుట్టినిల్లు.. నా బాల్యం అంతా ఇక్కడే గడిచింది. ఇక్కడే చదువు పూర్తి చేశాను. రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేసిన నేను పార్లమెంట్‌లో విశాఖ నగర అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల కోసం పలుమార్లు ప్రస్తావించాను. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుంది. ఇదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతం. రాష్ట్ర భవిష్యత్‌కూ విశాఖే ఆశాకిరణం. విశాఖ పార్లమెంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా బీసీ మహిళనైన తనకు సీఎం జగన్ అవకాశం కల్పించారు. మెట్టినింటి నుంచి పుట్టినింటికి వచ్చి ప్రజాసేవ చేసే అవకాశం కలిగింది. ఈ ఎన్నికల్లో గెలిచి ఈ ప్రాంత ఆడపడుచుగా స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకుంటా.. విశాఖ అభివృద్ధి కృషి చేస్తా.' అని వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

మెట్టినింటి నుంచి పుట్టినింటికి..

దశాబ్దాల కాలంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందాలన్నదే నా ఆకాంక్ష. ఉత్తరాంధ్రలోని విశాఖ నగరం పరిపాలన రాజధాని అయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. విశాఖ నాకు పుట్టినిల్లు. ఈ ప్రాంతంలోనే నా బాల్యం, విద్యాభ్యాసం పూర్తి చేశాను. విశాఖ ప్రజలకు ఏం కావాలో.. విశాఖను ఎలా అభివృద్ధికి చేయాలో.. నిధులు ఎలా తీసుకురావాలో నాకు తెలుసు. ఈ ప్రాంత ఆడపడుచుగా విశాఖ ప్రగతికి కృషి చేస్తాను. మెట్టినింటి నుంచి పుట్టినింటికి వచ్చి ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

సంక్షేమ పథకాలతో మహిళల ఆర్థిక స్వావలంబన

'ఇంటికి వెలుగు ఇల్లాలే..'అన్నట్టుగా ప్రతీ ఇల్లు బాగుండాలంటే ఆ ఇంట్లో మహిళ ఆర్థికంగా ఎదగాలి. అప్పుడే ఆ కుటుంబం ఆర్థిక పరిపుష్టి సాధిస్తుంది. అలాంటి పాలన 2019–2024 వరకు చూశాం. ఎంతో ముందు చూపుతో.. పెద్ద మనసుతో మహిళలే లబ్ధిదారులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, ఆసరా, చేదోడు, గృహ నిర్మాణం, సున్నా వడ్డీ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం తదితర పథకాల ద్వారా మహిళల ఖాతాలకే డీబీటీ పద్ధతిలో నగదు జమ చేసి.. ఆర్థికంగా బలోపేతం చేశారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ.. మరింత ఆర్థికంగా ఎదుగుతున్నారు. గ్రామీణ ప్రాంతంలోనే కాకుండా అర్బన్ ప్రాంతంలో కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించారు. ఎక్కడా అవినీతి లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా యావత్ దేశం ప్రశంసించేలా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగింది.

స్టీల్‌ప్లాంట్ ఆంధ్రుల హక్కు

గతంలో రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేసిన నేను విశాఖకు అవసరమైన నిధులు, ప్రాజెక్టుల కోసం పార్లమెంట్‌లో గళం విప్పాను. బీహెచ్ఈఎల్, బీహెచ్‌వీఎల్ విలీనం ప్రక్రియ, షిప్‌యార్డు వెస్సెల్స్ కోసం పార్లమెంట్‌లో ప్రస్తావించాను. విశాఖ నగరానికి మెట్రో రైలు తీసుకురావాలని, భోగాపురం ఎయిర్‌పోర్టు వంటివి మహానేత వైఎస్సార్ హయాంలో ఆలోచన చేశాం. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. భావితరాల భవిష్యత్ కోసం వేలాది ఎకరాల భూములను ఇక్కడి ప్రజలు త్యాగం చేశారు. భవిష్యత్ బాగుంటుందనే భూములిచ్చారు.. ప్రైవేటీకరణ కోసం కాదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ కృషి చేస్తోంది. ఇక్కడి ప్రజల సెంటిమెంట్, విశాఖ స్టీల్ పరిరక్షణ బాధ్యతను ఈ ప్రాంత ఆడపడుచుగా తీసుకుంటాను. నేను ఎంపీగా గెలిచి.. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఉద్యమిస్తాను. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అందరం కలిసి అడ్డుకుందాం.

అన్ని స్థానాలు క్లీన్‌స్వీప్ చేస్తాం

విశాఖ పార్లమెంట్ పరిధిలో గత ఎన్నికల్లో నాలుగు సీట్లు కోల్పోయాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసిన ప్రజలు.. ఈ సారి అన్ని సీట్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు.ప్రచారానికి వెళ్తున్న సమయంలో లబ్ధి పొందిన మహిళలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులను చూసి ఐక్యరాజ్యసమితిలో పెద్దలు సైతం ప్రశంసల జల్లు కురిపించారు. ప్రపంచంతో పోటీ పడేలా విద్యార్థుల భవిష్యత్‌ను సీఎం జగన్ తీర్చిదిద్దుతున్నారు. పేదోడి ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచారు. విశాఖలో పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధి సీఎం జగన్‌తో సాధ్యమైంది.

విశాఖే రాష్ట్ర భవిష్యత్

రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయింది. రాష్ట్రానికి విశాఖ లాంటి ప్రాంతం రాజధానిగా అవసరం ఉంది. రాష్ట్ర భవిష్యత్ అంతా విశాఖ నగరమే. విశాఖ పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. రాజధానికి కావాల్సిన మౌలిక వసతులు, రోడ్డు, విమాన, ఓడ రేవు కనెక్టివిటీ ఉంది. ఆనాడు మహానేత వైఎస్సార్ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని రూపుమాపేలా అభివృద్ధి చేశారు. ఆ తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటు పడింది. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం జగన్ అంతకుమించి ఉత్తరాంధ్ర కోసం ఆలోచన చేస్తున్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే దేశంలోనే టాప్ నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతుంది. విశాఖ పార్లమెంట్‌తో పాటు అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి.. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ముందడుగు వేయాలి.

ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకే..





పార్టీ శ్రేణులు, ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

- గెలిచిన తర్వాత విశాఖ నుంచే సీఎం జగన్ పాలన
- రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి
- దక్షిణలో ప్రచారం ప్రారంభించిన వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎన్ని కూటమిలు కలిసి వచ్చినా ప్రజల మద్దతుతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలుపు ఆపడం ఎవరితరం కాదని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని దుర్గాలమ్మ ఆలయంలో బుధవారం పూజా కార్యక్రమం అనంతరం వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన తర్వాత విశాఖ నుంచే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తారన్నారు. రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బలహీన వర్గాల ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజా శ్రేయస్సే పరమావధిగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీకి అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కూటమి పేరుతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీలు వైఎస్సార్ సీపీపై దాడి చేయడానికి వస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతు ఇచ్చిన పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు పూనుకున్న పార్టీకి చంద్రబాబు మద్దతు తెలపడం దారుణమన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పార్లమెంట్ అభ్యర్థిని బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వై.వి.సుబ్బారెడ్డి అభ్యర్థించారు.

పార్లమెంట్ అభ్యర్థిని బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. ఆయన అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి అభివృద్ధి, యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా నవరత్నాలు ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు విజయవంతంగా అందిస్తున్న నేత సీఎం జగన్ అన్నారు. ఆయన్ని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్రంలో విశాఖ గళం వినిపించడానికి ఎంపీగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు మద్దతిస్తున్న కూటమి పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి మాట్లాడుతూ దక్షిణంలో అందరి బాగోగులు తెలిసిన వాడిని.. ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ భరోసా కల్పించానన్నారు. దక్షిణ ప్రజలు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, దక్షిణ ఎన్నికల పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రికార్డ్ బ్రేక్!



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల తాకిడిలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఎయిర్‌పోర్టు ఏర్పాటయ్యాక అత్యధిక మంది ప్రయాణికుల రాకపోకలను ఇప్పుడు నమోదు చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు 2.9 మిలియన్లు (29 లక్షల మంది) ప్రయాణికులు రాకపోకలతో ఈ రికార్డును సొంతం చేసుకుంది. ఇప్పటివరకు 2018లో 28.54 లక్షల మంది ప్రయాణించడమే అత్యధికం. కానీ ఇప్పుడు ఆ సంఖ్యను అధిగమించి 29 లక్షలకు చేరుకోవడం విశేషం! కోవిడ్–19 తర్వాత ఇతర ఎయిర్‌పోర్టుల మాదిరిగానే విశాఖ విమానాశ్రయానికి కూడా ప్రయాణికుల తాకిడి గణనీయంగా తగ్గింది. కోవిడ్ ప్రభావంతో 2020–21లో 11.14 లక్షల మంది మాత్రమే ఈ ఎయిర్‌పోర్టు ద్వారా ప్రయాణించారు. ఆ తర్వాత ఏడాది స్వల్పంగా పెరిగినా 16.31 లక్షలకు మించలేదు. అనంతరం ఏటికేడాది విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇలా 2022–23లో 25 లక్షలకు, ఈ ఏడాది 29 లక్షలకు ఎగబాకింది. రానున్న ఏళ్లలో అది మూడు మిలియన్ల (30 లక్షల)కు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని 3.6 మిలియన్లకు విస్తరించారు. అందుకనుగుణంగా ఎన్నో సదుపాయాలను కల్పించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సౌకర్యాలను సమకూర్చారు. కొద్దిరోజుల క్రితమే ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ను ప్రారంభించారు. చెక్ ఇన్ కౌంటర్లను 20–30కి పెంచారు. అరైవల్, డిపాచర్ టెర్మినల్ వద్ద మనీ ఎక్స్ఛేంజి కౌంటర్లు, తనిఖీల వేగవంతానికి ఇప్పుడున్న నాలుగు ఎక్స్‌రే స్కానింగ్ మిషన్లకు అదనంగా మరో రెండింటిని ఏర్పాటు చేశారు. డిజీ యాత్ర యాప్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నారు. ఇన్‌లైన్ బ్యాగేజీ వ్యవస్థను రెండు నెలల్లో సిద్ధం చేస్తున్నామని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు. విమానాశ్రయం ప్రయాణికుల రద్దీ 2.9 మిలియన్లను అధిగమించడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ముమ్ముందు 3 లక్షల మిలియన్ల మైలురాయికి చేరుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

పదేళ్లలో విమాన ప్రయాణికుల సంఖ్య

సంవత్సరం	ప్రయాణికులు
2014-15	10,97,566
2015-16	18,07,389
2016-17	23,59,234
2017-18	24,81,701
2018-19	28,54,118
2019-20	26,91,581
2020-21	11,14,704
2021-22	16,31,316
2022-23	25,00,789
2023-24	29,00,000

(మార్చి 27 వరకు)

పెరుగుతున్న విమాన సర్వీసులు..

మరోవైపు ఈ ఎయిర్‌పోర్టుకు విమాన సర్వీసులు కూడా పెరుగుతున్నాయి. ప్రస్తుతం సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు నడుస్తోంది. త్వరలో కౌలాలంపూర్, బ్యాంకాక్‌లకు కూడా కొత్త సర్వీసులు ప్రారంభమవుతున్నాయి. ఇవికాకుండా హైదరాబాద్, ఢిల్లీలకు కూడా రెండు దేశీయ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

సింహగిరిపై ఆధ్యాత్మిక కాంతులు



స్వామి ఉత్సవమూర్తుల చెంతన వేద స్వస్తిని నిర్వహిస్తున్న అర్చకులు, రుత్వికులు

- వైభవంగా సుదర్శన నారసింహ మహాయజ్ఞం ప్రారంభం
- పూర్ణాహుతిలో పాల్గొన్న శారదాపీఠాధిపతులు
- తొలిరోజు పాల్గొన్న వంద మంది ఉభయదాతలు



యజ్ఞశాలలో సుదర్శన నారసింహ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు



యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు



శారదా పీఠాధిపతులను సత్కరిస్తున్న సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరి బుధవారం సుదర్శన నారసింహ మహాయజ్ఞం శోభను సంతరించుకుంది. ఎటు చూసినా యజ్ఞకాంతులతో ప్రజ్వరిల్లింది. లోకకల్యాణార్థం ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న సుదర్శన నారసింహ మహాయజ్ఞంను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి యజ్ఞఘట్టాలను నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఓ పల్లకీలో, చక్రపెరుమాళ్‌ను ఓ పల్లకీలో అధిష్ఠింపజేసి ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ను, మరొక వేదికపై స్వామి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. యాగశాల మూర్తి ఆరాధన, శాంతిపాఠం, గోపూజ నిర్వహించారు. ప్రకృతి సిద్ధంగా అగ్ని మథనం చేశారు. అనంతరం అగ్నిప్రతిష్ఠాపనం, కుంభావాహనం, మండలావాహనం, ధ్వజారోహణం చేపట్టారు. తదుపరి యజ్ఞశాలలో ఏర్పాటు చేసిన ఐదు హోమ గుండాల వద్ద రుత్వికులు యజ్ఞాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులకు అందజేశారు. అనంతరం ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రబంధం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకాలను వైదికులు పఠించారు. రాష్ట్రవ్యాప్తంగా, తమిళనాడు నుంచి వచ్చిన సుమారు 60 మంది రుత్వికులు యజ్ఞం నిర్వహించారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలకు దేవస్థానం తరపున శాలువా, రవిక, కల్యాణం లడ్డూ, అర కిలో పులిహోర ప్రసాదం, అప్పన్న స్వామి రాగి ప్రతిమ అందజేశారు. ప్రత్యేకంగా భోజన సదుపాయం అందజేశారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం వంశపార ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతి రాజు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్నకు శారదాపీఠాధిపతులు పూజలు

సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో పాల్గొనేందుకు వచ్చిన శారదాపీఠాధితులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వారికి దేవస్థానం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీల పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరఫున ఈవో శ్రీనివాసమూర్తి స్వామీజీలకు శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

హనుమంతు సుశీలమ్మ ఇక లేరు


సుశీలమ్మ(ఫైల్)

సీతమ్మధార: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి హనుమంతు లజపతిరాయ్ తల్లి హనుమంతు సుశీలమ్మ (89) అనారోగ్యంతో బుధవారం మధురవాడలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె భర్త హనుమంతు వెంకట కృష్ణారావు ఉమ్మడి రాష్ట్రంలో విశాఖపట్నంతో పాటు పలు ప్రాంతాల్లో జిల్లా న్యాయమూర్తిగా పనిచేశారు. ఆమె సొంత గ్రామం శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం తలగాంనకు సుశీలమ్మ మృతదేహన్ని తరలించారు. గురువారం 10 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని లజపతిరాయ్ తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

విశాఖ లీగల్: చిన్న చిన్న తగదాల కోసం కోర్టులు, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించొద్దని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. జిల్లా న్యాయాధికార సంస్థ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సహకారంతో జాతీయ మహిళ కమిషన్ (న్యూఢిల్లీ) సూచనల మేరకు మహిళలకు ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ పురుషులకు 21 సంవత్సరాలు, మహిళలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. పని ప్రదేశంలో వేధింపుల నివారణ, పోక్సో చట్టం, బాల్య వివాహాలు అరికట్టడం, మనోవర్తి చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ పి.ఉష, లైంగిక వేధింపుల ఫిర్యాదుల కమిటీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పి.ఉష, వివిధ శాఖల అధికారులు బి.డి.జ్యోతిలత, ఎస్.సరజ, కె.శకుంతల, వీవీ కళ్యాణి, జి.శరణ్య పాల్గొన్నారు.

అప్పుల బాధ తప్పింది



నా పేరు బొండా బాలు, మాది అనకాపల్లి మండలం రేబాక. నేను 2014 ఏడాదిలో సొంతంగా ఆటో కొనుక్కున్నాను. ఆటో నడపడం వల్ల ప్రతి రోజు డీజిల్ ఖర్చు పోను రూ.300 వరకు మిగిలేవి. వాటితో ఇంటిల్లిపాది జీవనం సాగించేవారిమి. ఆటోకు ప్రతి ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేసుకోవలసి వచ్చేది. ఇందుకోసం వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకుని చెల్లించేవాడిని. ఆటో సర్వీస్‌తో వచ్చిన డబ్బు వడ్డీలకే సరిపోయేది. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడేవాడిని. జగనన్న ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా ప్రతి ఏటా రూ.10 వేలు ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ సొమ్ముతో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు తీసుకుంటున్నాను. ఆ తరువాత ఎటువంటి అప్పులు తీసుకోలేదు. ఆటో సర్వీసుతో వచ్చిన సొమ్ముతో చాలా సంతోషంగా జీవిస్తున్నాను.

బతుకు బండికి భరోసా ఇచ్చారు




నా పేరు కోడి నాగరాజు. మాది మాకవరపాలెం మండలం తూటిపాల. నేను 20 సంవత్సరాల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. ఐదేళ్ల కిందటి వరకూ కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులకు జగనన్న అండగా నిలిచారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా వరుసగా ఐదు సంవత్సరాలు ఏడాదికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు నా ఖాతాలో జమ చేశారు. కరోనా కష్ట కాలంలో కూడా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయం నా ఖాతాలో వేశారు. వాహనమిత్ర డబ్బుతో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుని ధైర్యంగా ఆటో తిప్పుతున్నాను. నా పెద్ద కుమార్తెకు విద్యా దీవెన పథకం కింద రూ.56,538, చిన్న కుమార్తెకు అమ్మఒడి పథకంలో రూ.43,000, నా కుమారుడికి వసతి దీవెనలో రూ.52,825 అందడంతో వారి చదువులకు ఇబ్బంది లేకుండా పోయింది. నా భార్యకు వైఎస్సార్ ఆసరాలో రూ.61,521, సున్నా వడ్డీ రూ. 2,666 అందాయి. కోవిడ్ సాయంగా రూ.10 వేలు అందించారు. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న మాకు సంక్షేమ పథకాలతో ఈ ప్రభుత్వం ఒక అండగా నిలిచింది.

వాహన మిత్రోత్సాహం!

- ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు
- ఉమ్మడి విశాఖలో ఏడాదికి 36 వేల మందికి మేలు
- ఐదేళ్లలో రూ.179.21 కోట్లకు పైగా సాయం
- తమ కోసం ఆలోచించిన ఏకైక సీఎం జగనే అంటున్న డ్రైవర్లు



డ్రైవర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి(ఫైల్)



సాక్షి, విశాఖపట్నం/గోపాలపట్నం: ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న వారి సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేసిన వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఎంతగానో ఉపయోగపడింది. ఇన్సూరెన్స్, రిపేర్లు, సర్వీసింగ్ వంటి ఖర్చుల నుంచి కాస్త ఉపశమనం ఇచ్చేలా ఏటా రూ.10 వేలు చొప్పున ఐదేళ్లు సాయం అందించింది. ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్ డ్రైవర్లు ఏ రోజు కారోజు వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో బీమా సొమ్ము చెల్లించలేక పోతున్నారు. తమ వాహనాలకు మరమ్మతులు చేయాలన్నా అప్పులు చేయాల్సి వస్తోంది. వాటిని తీర్చడానికి మరింత అప్పుల పాలవుతున్నారు. అరకొర రాబడితో జీవనం సాగించే వీరి కుటుంబాలకు చేయూత నివ్వాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపోశారు. ఏలూరులో పాదయాత్రలో ఉండగా 2018 మే 14న తాను అధికారంలోకి వచ్చాక ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. ఆ ప్రకారమే అధికారంలోకి వచ్చాక 2019 అక్టోబర్ 14న వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి ఏలూరులోనే శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద ఏటా ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10 వేల చొప్పున ఇస్తున్నారు. ఈ సొమ్ముతో వారు వాహనాల ఫిట్‌నెస్, మరమ్మతులు, బీమా తదితర అవసరాలు తీర్చుకుంటారన్న సంకల్పంతో క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఈ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నారు. దీంతో గడచిన ఐదేళ్లుగా వీరు ఎంతో సంతోషంగా ఉన్నారు. గతంలో తమ కోసం ఇంతలా ఆలోచించిన ముఖ్యమంత్రులు లేరని ఈ వాహన మిత్రలు పేర్కొంటున్నారు. అందుకే తమకు ఆర్థికంగా దన్నుగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎప్పుడూ రుణ పడి ఉంటామని, అండగా నిలుస్తామని చెబుతున్నారు.

ఐదేళ్లలో ఎంత సాయమంటే..?

ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 36 వేల మందికి వాహనమిత్రలు పథకం కింద ఆదుకున్నారు. వీరికి ఈ ఐదేళ్లలో రూ.179.21 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. 2019 నుంచి 2022 వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.104.83 కోట్లు, మిగిలినది ఈ రెండేళ్లలోను చెల్లించారు. జిల్లాల పునర్విభజన జరిగాక విశాఖపట్నం జిల్లాలో రూ.41.84 కోట్లు, అనకాపల్లి జిల్లాలో రూ.25.84 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.6.70 కోట్లను వాహన మిత్ర పథకం కింద అందజేశారు.

అర్హులందరికీ సాయం



వాహనమిత్ర పథకంతో నాకు చాలా మేలు జరిగింది. ఆటో మరమ్మతులు చేసుకోవడం, బీమా కోసం ఈ మొత్తాన్ని వినియోగించుకున్నా.. అర్హత ఉన్న ప్రతి ఒక్క ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, వాహన యజమానుల కళ్లలో సీఎం జగన్ ఆనందం నింపారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–బి.కోటేశ్వరరావు, వెంకటాపురం

గౌరవంగా జీవిస్తున్నాం



దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏటా రూ.10 వేల సాయాన్ని అర్హులైన ప్రతీ ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్‌లు అందుకున్నారు. ఈ మొత్తం ఎంతో ఉపయోగపడుతోంది. గతంలో సకాలంలో బీమా కట్టలేక ఇబ్బందులు పడేవాళ్లం. రోడ్డుపై పోలీసులు కనిపిస్తే భయపడేవాళ్లం. వాహన మిత్ర పథకం వల్ల అన్ని రికార్డులు ఉన్నాయి. ఎంతో గౌరవంగా గర్వంగా బతుకుతున్నాం.

– పిట్ట అశోక్ కుమార్, పద్మనాభనగర్

డీజిల్ స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

దాబాగార్డెన్స్: సముద్రంలో ఉన్న నౌకల నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేసే ముఠా గుట్టు రట్టయ్యింది. నిందితులు వీర్రాజు, బడే రాజు, సూరాడ రామును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు డీసీపీ – 2 ఎం.సత్తిబాబు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సముద్రంలో ఉన్న నౌకల నుంచి డీజిల్ తస్కరించి బోట్ల ద్వారా తీరానికి తీసుకొచ్చి లీటర్ డీజిల్ రూ.60, రూ.70కి విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. సుమారు 13 మంది నౌకల నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేస్తున్నట్టు గుర్తించామని, వీరిలో ముగ్గురు పట్టుబడగా, మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. వీరంతా కాకినాడ, మచిలీపట్నం నుంచి పెద్ద ఎత్తున స్మగ్లింగ్ చేసి విశాఖ తీరానికి తరలిస్తున్నారని, 12 కేన్‌లలో 500 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


మోహన్ (ఫైల్)

ఆనందపురం: మండలంలోని గంభీరం రిజర్వాయర్‌లో పడి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కొమ్మాది సాయిరామ్ కాలనీలో నివసిస్తున్న వారాడ మదన్ మోహన్ నగరంలోని ఓ మొబైల్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. అతనికి తల్లిదండ్రులు రమాదేవి, వెంకటేశ్వరరావు, భార్య సంతోషి, కుమార్తె భాగ్యశ్రీ ఉన్నారు. కాగా మదన్ మోహన్ (35) మంగళవారం ఉదయం విధులకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. అలా వెళ్లిన మదన్ మోహన్ రాత్రికి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా మండలంలోని గంభీరం రిజర్వాయర్‌లో యువకుడి మృతదేహం ఉన్నట్లు కొంత మంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్‌ఐ శివ సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతదేహన్ని పరిశీలించిన పోలీసులు అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న మదన్ మోహన్ తల్లి రమాదేవి మృతదేహాన్ని పరిశీలించి మదన్ మోహన్‌గా గుర్తించింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ శివ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలిసెట్ ఉచిత కోచింగ్‌కు ఏర్పాట్లు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ కాలేజీల్లో చేరి సాంకేతిక విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఏప్రిల్ 27న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి.నాగరాణి ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో ఉచిత కోచింగ్ అందిస్తామని తెలిపారు. పదో తరగతి పాసైన వారితోపాటు పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లి ఈ నెల 28 నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1 నుంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి సంబంధించి నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే కోచింగ్‌కు అవకాశమిస్తామని తెలిపారు. పెందుర్తి, భీమిలి ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలతోపాటు కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో కూడా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

396 నక్షత్ర తాబేళ్లు స్వాధీనం


డీఆర్‌ఐ స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

తాటిచెట్లపాలెం: అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. షాలిమర్ ఎక్స్‌ప్రెస్‌లో నక్షత్ర తాబేళ్లు అక్రమంగా తరలిస్తున్నట్లు ముందుగా అందిన సమాచారంతో డీఆర్‌ఐ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. 396 నక్షత్ర తాబేళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, తాబేళ్లను ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

నీటి సంపులో పడి సెక్యూరిటీ గార్డు మృతి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం: డ్యూటీలో ఉంటూ నీటి సంపులో పడి ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా కశింకోట గ్రామానికి చెందిన అల్లవరపు గణేష్ (32) ఆటోనగర్‌లోని ఎస్ బ్లాక్ వద్ద ఉన్న టీపీఎల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతని భార్య దేవి కూడా ఆటోనగర్‌లో పనిచేస్తున్నారు. వీరు దువ్వాడ సెక్టార్ – 1 మంగళపాలెం శ్రీసాయినగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లిన గణేష్ బుధవారం ఉదయం టీపీఎల్ కంపెనీలో ఉన్న నీటి సంపులో విగతజీవిగా పడి ఉన్నాడు. నీటి సంపుపై రక్షణగా జాలీ లేదు. దీంతో టీపీఎల్ కంపెనీ యాజమాన్యం దువ్వాడ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గణేష్ భార్య దేవికి అక్కడే పని చేస్తున్న కంఠపురెడ్డి శ్రీను విషయం తెలియపరిచాడు. వెంటనే అక్కడికి చేరుకున్న భార్య దేవి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఆర్టీసీ కండక్టర్


- టీడీపీ, జనసేన ఎన్నికల ప్రచారంలో ప్రసంగించిన ఉద్యోగి
- అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దేవరాపల్లి: టీడీపీ, జనసేన ఎన్నికల ప్రచారంలో ఓ ఆర్టీసీ కండక్టర్ పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడు. మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన సూరెడ్డి ఈశ్వరరావు మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. కాశీపురంలోని జనసేన మండల పార్టీ కార్యాలయంలో ఈ నెల 19న జరిగిన జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థితో కలిసి రాజకీయ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించాడు. ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ ఎన్నికల నియమావళిని అతిక్రమించి రాజకీయ పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న కండక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కాశీపురం గ్రామస్తులు ఈ నెల 20న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి, దేవరాపల్లి మండల సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి. సత్యవాణి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.లక్ష్మీనారాయణ వద్ద ప్రస్తావించగా ఫిర్యాదుపై విచారణ జరిపి సదరు ఆర్టీసీ రీజనల్ మేనేజర్, డిపో మేనేజర్‌కు తెలియజేశామని, ఆర్టీసీ అధికార్లు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించండి

మహారాణిపేట: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-7, 8 దరఖాస్తులపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అలాగే ఎన్నికల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, అన్ని ప్రచార అనుమతులు నిర్దేశిత సమయంలోగా అందజేయాలని పేర్కొన్నారు. బుధవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఫారం-7, 8 దరఖాస్తులు 52 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 38 ఇతర రాష్ట్రాలకు చెందిన ఫారం-8లు ఉన్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సీజర్‌పై గట్టి నిఘా ఏర్పాటుచేసి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఎంసీసీ, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, పోలీస్ బృందాలతో నిఘా పటిష్టం చేసినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలను అప్రమత్తం చేశామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, రిటర్నింగ్ అధికారులు హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కరరెడ్డి, శేష శైలజ, లక్ష్మారెడ్డి, అఖిల, మూర్తి, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నవ్విపోదురు గాక..



ఈ నెల 18న వంశీకృష్ణ సమక్షంలో.. ఈ నెల 27న వంశీకృష్ణ, గండి బాబ్జీ సమక్షంలో పార్టీలో చేరిన మన్యాల శ్రీనివాస్

యమలీల సినిమాలో ఓ డైలాగ్ గుర్తుందా? 'మా చెల్లి పెళ్లి.. జరగాలి మళ్లీ మళ్లీ.. 'అన్నట్టుంది విశాఖ దక్షిణంలో ఓ నాయకుడు తీరు. గతంలో ఓ పార్టీలో పనిచేసిన మన్యాల శ్రీనివాస్ ఈ నెల 18న వంశీకృష్ణ సమక్షంలో జనసేనలో చేరారు. తాజాగా బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గండి బాబ్జీ సమక్షంలో మళ్లీ జనసేన కండువా కప్పుకున్నారు. ఇదేంటి మొన్నే కదా పార్టీలో చేరాడు.. మళ్లీ చేరడమేంటని సొంత పార్టీ నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. ఇక మిగిలింది బీజేపీ కార్యాలయం అని.. అక్కడ కూడా కండువా వేసుకుంటే ఒక పనైపోతుందని ఎద్దేవా చేస్తున్నారు. – దాబాగార్డెన్స్

ఆర్వోలదే కీలకపాత్ర

- త్వరితగతిన అనుమతులు జారీ చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులదే కీలకపాత్ర అని, ప్రతీ ఆర్వో తమ విధులుగా బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ బృందాలతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. జాతీయ రహదారి, ప్రధాన రహదారుల సమీపంలో ఇప్పటి వరకు ఉన్న హోర్డింగులను సమాన ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించాలన్నారు. ఇంటి పైకప్పులపై యజమానుల అనుమతితో చిన్న బ్యానర్, జెండా ఉండవచ్చని, దీనికి కూడా ఆర్వో అనుమతి తప్పనిసరి అని తేల్చిచెప్పారు. వివిధ ప్రాంగణాల్లో ఉన్నటువంటి శిలాఫలకాలపై రాజకీయ నాయకుల పేర్లు, ఫొటోలను తొలగించాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు నడుచుకోవాలని.., ఈ విషయాన్ని విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే 10 మంది వలంటీర్లపై కేసులు నమోదు చేసి విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. ఏ వ్యక్తి వద్ద వస్తురూపేణా రూ.10 వేలకు మించి ఉండరాదని, రూ.20 వేలకు మించి డొనేషన్ స్వీకరించరాదన్నారు. రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని వివరించారు. వీటికి మించి ఉన్న వాటిని సీజ్ చేస్తామని, దానికి తగిన పత్రాలు చూపితే విడుదల చేస్తామన్నారు. జిల్లాలో సి-విజిల్ బృందంగా బాగా పనిచేస్తోందన్నారు. రాజకీయ పక్షాలు నిర్వహించే సభలు, ర్యాలీలు ఇతర కార్యక్రమాల నిర్వహణ కోసం సి-విజిల్ యాప్‌లో దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోగా అనుమతి మంజూరుచేయాల్సి ఉందన్నారు. అయినప్పటికీ దరఖాస్తు వచ్చిన తక్షణమే వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీవీఎంసీ పరిధిలో సుమారు 500 వరకు చలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ప్రతి చలివేంద్రం వద్ద ఓటర్లను జాగృతిని చేసేలా బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఎక్కడైనా లోపాలున్నట్లు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏప్రిల్ 14వ తేదీ వరకు ఫారం- 6 దరఖాస్తులను స్వీకరించవచ్చని, ఇప్పటికే పెండింగ్‌లో దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 8 రకాల పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయని, వాటిలో ఫారం-12, ఫారం-12డి ఉంటాయని చెప్పారు. ఫారాలను ఏ వర్గం వారు వినియోగించుకోవాలనే అంశాలపై అధికారులకు స్పష్టత ఇచ్చారు. వీటిపై దశల వారీగా సమావేశాలను నిర్వహించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఎం.సి.సి జిల్లా నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రిటర్నింగ్ అధికారులు హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కరరెడ్డి, శేష శైలజ, లక్ష్మారెడ్డి, అఖిల, మూర్తి తదితరులు పాల్గొన్నారు.